క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీ కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజల అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో బీజేపీ విఫలం

నంద్యాల(న్యూటౌన్): మహిళలకు దేశంలో రక్షణ కల్పించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, సహాయ కార్యదర్శి కిరణ్ కుమార్, డీవైఎఫ్‌ఐ కార్యదర్శి శివ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతినగర్ సెంటర్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా చర్యలు శూన్యమన్నారు. మణిపూర్‌లో జరిగే అల్లర్లకు బీజేపీ ప్రభుత్వం మద్దతు ఉందని ఆరోపించారు. దళిత మహిళలపై అత్యాచారాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మహేష్, భార్గవ్, రమణ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో మహానంది మండల కమిటీని ఎన్నుకున్నారు. మహానంది మండల అధ్యక్షుడిగా శ్రీమౌళిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా బాల నాగమణి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాసరావును ఎన్నుకున్నట్లు చెప్పారు. నాయకులు భాస్కరరెడ్డి, విజయరావు, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 300మంది విద్యార్థులు ఉన్నచోట ఇద్దరు ఆయాలను నియమించాలని, పనిభారం తగ్గించాలన్నారు. ఆయాలకు పీఎఫ్, ఈఎస్‌ఐ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు శ్రీనివాసులు, కుళాయిస్వామి పాల్గొన్నారు.

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోండి

దొర్నిపాడు: కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ వరకు సమయం ఉందని మండల వ్యవసాయాధికారి సునీత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు తగిన ధ్రువపత్రాలతో ఆర్బీకేల్లో వ్యవసా సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనేలా గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించాలని సూచించారు.

మొక్కజొన్న పంట తొలగింపు


ఆర్. నాగులవరం వద్ద మొక్కజొన్న పంటను దున్నేస్తున్న రైతు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో రైతు గుర్రప్ప తాను సాగుచేసిన మొక్కజొన్న పంటను ట్రాక్టరుతో దున్నేశాడు. నెల క్రితం నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. అయితే మొక్కలు తక్కువగా ఉండటంతో పాటు కలుపు అధికంగా పెరిగింది. దీంతో దిగుబడులు రాక నష్ట పోవాల్సి వస్తుందని భావించి అరకొరగా ఉన్న పంట మొత్తం దున్నేసి మినుము పంట సాగుకు సిద్ధం చేస్తున్నట్లు రైతు తెలిపాడు. అలాగే ముందస్తుగా సాగు చేసిన మిర్చి పంటకు బింగి తెగులు సోకి మొక్కల్లో ఎదుగుదల లేక పోవడంతో రుద్రవరం,అప్పనపల్లె,రెడ్డిపల్లె,తిప్పారెడ్డిపల్లె. టీ.లింగందిన్నె తదితర గ్రామాల్లో మిర్చి పంటను దున్నేసి మరో పంట సాగు చేశారు.

బీమా తక్షణ సాయం అందజేత

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన పగడాల చిన్న గుర్రెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు శనివారం మృతుడి భార్య వెంకట సుబ్బమ్మకు సర్పంచు పెద్ది రమణయ్య, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నరహరి వైఎస్సార్ బీమా కింత తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట రమణభట్టు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు .. ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే.. అది ఎంత చిన్నదైనా.. మండల కార్యాలయాలకు వెళ్లాలి.. అక్కడకు గ్రామ సర్పంచో, ఎంపీటీసీనో కనీసం ఆ గ్రామానికి చెందిన ఏదో ఓ చోటామోటా నాయకుడినో తీసుకెళ్లాలి. వారు రావాలంటే వారి ఇళ్ల చుట్టూ తిరగాలి. వారు ఖాళీగా ఉన్న రోజునే వెళ్లాల్సిన పరిస్థితి. ఇంత చేసి కార్యాలయానికి వెళ్తే అధికారులు, సిబ్బంది చేతులు తడిపితే కానీ మన వంక చూడని దుస్థితి. అప్పటికే వారికి ఖర్చులు తడిసిమోపడై ఉంటాయి. ఆ వెంటనే పని అయిపోదు.. తాను పనిలో ఉన్నానని అధికారి చెప్పడం, మరో రోజు వెళ్తే సంబంధిత అధికారి లేడని, గుమాస్తా రాలేదంటూ మూడు నాలుగు వారాలు తిరగాల్సి వచ్చేది. చివరకు మన వంతు వచ్చినప్పుడు నువ్వు ఎవరి తాలూకా.. ఏ పార్టీ.. అంటూ ఆరా తీసి తమకు నచ్చని వారైతే పని మరింత ఆలస్యమవుతుంది. కావాల్సిన వారైతే సరే.. పలానా రోజు రమ్మని చెప్పి అప్పుడు అందజేసే వారు. ఇక అత్యవసరమైన వారికి జేబులు గుల్ల అయ్యినట్లే. కేవలం చిన్నపాటి సర్టిఫికెటుకే ఇంత ఇబ్బంది పెడితే ఇక సంక్షేమ పథకాలు వర్తించాలంటే.. కేవలం అధికార పార్టీ వాడు అయ్యుండాలనేది ప్రధాన అర్హత, ఇక జన్మభూమి కమిటీల సిఫారసు, ఇవన్నీ ఉన్నా అందరికీ రావు. గ్రామానికి ఏ పదో పాతిక మందికో వర్తించేవి. మొత్తం మీద ఒక గ్రామంలో అన్ని పథకాల లబ్ధిదారులు 20–30 మందికి మించేవారు కాదంటే నాడు పాలన ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

నేడు .. ప్రజలను ఇలాంటి అవస్థల నుంచి తప్పించేలా, పనులు మానుకోవడం, చేతులు తడపడం, వేరొకరి సిఫారసు లేకుండా ఉండాలని గాంధీజీ కలలుగన్న గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామంలోనే ఆధునిక సౌకర్యాలతో భవనం నిర్మించి సకల వసతులతో పాటు 11–12 మంది వివిధ శాఖల అధికారులు, ఐదువందలకు పైగా సేవలందించేలా చర్యలు చేపట్టింది. కులం, మతం, పార్టీ, వర్గం లాంటి వాటికి తావివ్వకుండా ప్రజలకు అవసరమైన పనులన్నీ గ్రామం దాటకుండా పూర్తవుతున్నాయి. అదికూడా నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం జగనన్న సురక్ష పేరుతో ప్రజలకు అవసరమైన 11 ధ్రువ పత్రాలను పూర్తి ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నారు. అలాగే అర్హులకు పథకాలు అందజేస్తున్నారు.

- నియోజకవర్గంలో 'జగనన్న సురక్ష'తో పథకాలకు అర్హుల గుర్తింపు
- పర్యవేక్షిస్తున్న జిల్లా స్థాయి అధికారులు
- సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు
- అక్కడిక్కడే ధ్రువ పత్రాల అందజేత
- నియోజకవర్గంలో ఇప్పటి వరకు 13,824 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

నడిచొస్తున్న సంక్షేమం

అర్హులెవరూ సంక్షేమ పథకాలకు దూరంగా మిగిలిపోరాదని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో ఇంటికే వచ్చి అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను అందజేసి ఏ పథకానికి అర్హులో గుర్తించి వాటిని వర్తింపేజేసేలా చర్యలు చేపట్టింది. ఇంతకు ముందెన్నడూ ఇలాంటి కార్యక్రమం చేపట్టకపోవడంతో పథకాలు వర్తించక పేదలు మరింత పేదరికంలో కూరుకుపోయారు. తన పాలనలో అలాంటి పరిస్థితి ఉండకూడదని సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించడానికి రెండు, మూడు రోజులు ముందుగానే సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించి వివరాలు సేకరిస్తారు. అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ధ్రువ పత్రాలు పంపిణీ చేస్తున్నారు.

ఆళ్లగడ్డ: అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాల ని ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గంలో పకడ్బందీగా సాగుతోంది. ఆరు మండలాల పరిధిలో ఇప్పటి వరకు 48 గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహించి మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో, స్థానిక ప్రజాప్రతి నిధులను సమన్వయం చేసుకుంటూ 13,824 మందికి ధ్రువ పత్రాలు పూర్తి ఉచితంగా అందజేశారు.

కీలకంగా గృహసారథులు, వలంటీర్లు..

సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించడంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారథులుగా గ్రామ వలంటీర్లు, గృహసారథులు ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరికి ఏ ధ్రువ పత్రం అవసరమో గుర్తిస్తున్నారు. వారి వివరాలను ప్రభుత్వం అందజేసిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి టోకెన్ జారీ చేస్తారు. అలాగే పథకాలు అందకపోయి ఉంటే కారణాలు తెలుసుకొని అవసరమైన ధ్రువ పత్రం జారీకి దరఖాస్తు చేయిస్తున్నారు. వలంటీర్లు, గృహసారథులు పంపిన వివరాలను మండల స్థాయి ప్రత్యేక బృందం విచారణ జరిపి అర్హులని నిర్ధారణ అయితే మొత్తం 11 రకాల ధ్రువ పత్రాలు అందజేసి పథకాలకు అర్హత కల్పిస్తున్నారు. ఇదంతా కేవలం రెండు నుంచి నాలుగు రోజుల్లో పూర్తవు తుంది. ఇక సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధుల అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన వారికి ధ్రువ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నారు. రోజుల తరబడి తిరిగినా మంజూరు కాని సర్టిఫికెట్లు కేవలం రెండు నుంచి మూడు రోజుల్లో ప్రభుత్వ అధికారులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటికి వచ్చి అందజేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కోటకొండలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించి ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల (ఫైల్)

సురక్ష పూర్తయిన సచివాలయాలు	– 48
సచివాలయల పరిధిలో నివాస గృహాలు	– 47,477
ఇంటి సర్వే నిర్వహించిన నివాస గృహాలు	– 37,948
లబ్ధిదారులకు ఇచ్చిన టోకెన్లు	– 14,450
లబ్ధిదారులకు అందజేసిన సర్టిఫికెట్లు	– 13,824
అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు	– 626

పైసా ఖర్చు కాలేదు..



ఇక్కడ ఆళ్లగడ్డ ఎంపీడీఓ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని పేరు జ్యోతి, జి.జమ్మలదిన్నె గ్రామం. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. పాఠశాలలో చేరేందుకు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు కుల, ఆదాయ ధ్రువ పత్రాలు తప్పనిసరి అని ఉపాధ్యాయులు చెప్పారు. అయితే సాంకేతిక లోపంతో సర్టిఫికెట్, ఆధార్‌కు కొంచెం తేడా వచ్చింది. వివరాలను సరిచేసుకోవాలని అధికారులు, ఉపాధ్యాయులు సూచించారు. ఎవరిని సంప్రదించాలో తెలియక సతమతమవుతున్న తరుణంలో ఈ నెల 16న వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి సమస్యను విని అధికారుల దృష్టికి తీసుకెళ్లి టోకెన్ ఇచ్చాడు. ఈనెల 20న మార్పులు చేసిన ధ్రువపత్రాన్ని పైసా ఖర్చు లేకుండా అందజేశారు. దీంతో చిన్నారి హర్షం వ్యక్తం చేస్తోంది.

– కొత్తపల్లి జ్యోతి, విద్యార్థిని

అర్హులందరికీ పథకాలు అందజేయండి


మాట్లాడుతున్న గంధం రాఘవరెడ్డి

రుద్రవరం: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఎంపీపీ మబ్బు బాలస్వామి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. వ్యవసాయాధికారి శ్రీకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో పంటల సాగు తగ్గిందని ఖరీఫ్‌లో 8,200 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా కేవలం 2,600 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయని చెప్పారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లోని లే అవుట్లలో పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. హౌసింగ్ ఏఈ నాగరాజు, తాగునీటి సరఫరాపై ఏఈ ప్రమోద్, విద్యుత్ శాఖ నుంచి ఏఈ రాఘవేంద్రారెడ్డి, వైద్యం.. ప్రసాదు, పంచాయతీ శాఖ నుంచి ఏఈ వెంకటరాముడు, ఎంఐ ఏఈ మునాఫ్, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఏడీ గిడ్డయ్య తమ వివరాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. జెడ్పీటీసీ మాధవి, ఎంపీటీసీలు,సర్పంచులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏపీఓపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గిరిజనుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శ్రీశైలం ఐటీడీఏ ఏపీఓపై చర్యలు తీసుకోవాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజునాయక్, రవినాయక్ కోరారు. గిరిజనుల అభివృద్ధిని పట్టించుకోని ఏపీఓను ఉద్యోగ బాధ్యతల నుంచి తప్పించాలని శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీశైలం ఐటీడీఏలో పదేళ్లుగా విధులు నిర్వహిస్తూ గిరిజనుల సంక్షేమానికి వచ్చిన నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

అనుచితంగా మాట్లాడడం సరికాదు


ధ్రువ పత్రాలను అందిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): టీడీపీ నాయకురాలు అనిత వలంటీర్ల పట్ల అనుచితంగా మాట్లాడటం సరికాదని మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు.శుక్రవారం పట్టణంలోని సాయిబాబనగర్, సాదిక్‌నగర్, విజయపురికాలనీ, బొమ్మలసత్రం, మూలసాగరం, జ్ఞానాపురం ప్రాంతాలలో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించారు. ఆరు సచివాలయాలకు సంబంధించి 5,241 దరఖాస్తులు రాగా 5,215 మందికి టోకన్లు జారీ చేసి, 5,117 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. సాదిక్ నగర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మన్ పాంశావలి, కౌన్సిలర్లు కృష్ణమోహన్, శేకిరెడ్డి అనురాధ, ఎద్దు మనోరంజని, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ జయభారతరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవాకం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాలను వివరిస్తూ అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలన తీరు, ప్రతి గడపకు వచ్చి సమస్యలు తెలుసుకునేందుకే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉప మండలాధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీనివాసరెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, వివేకానంద రెడ్డి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

రుద్రవరం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ కోటయ్య తెలిపారు. మండలంలోని మందలూరులో మండల ఉపాధ్యక్షుడు వీరశంకర్‌రెడ్డి, సర్పంచు నిర్మలాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డితో కలిసి బడి బయటి పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తలిదండ్రులకు అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు సబియా,చరణ్, ఖాదర్,వలంటీర్లు ఉన్నారు.

బదిలీలపై హర్షం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న అధ్యాపకులను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. రఘునాథరెడ్డి, అధ్యాపకులు బాలచంద్రుడు, రామసుబ్బారెడ్డి, కరీముల్లా, హాజీవల్లీ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రీన్‌కో సోలార్ ప్రాజెక్టులో చోటుచేసుకున్న ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకొని ప్రమాద సంఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ కోరారు. శుక్రవారం సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు.

ఎన్నడూ లేని సంక్షేమం ఇంటికే వస్తుంది


పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: ఔను.. మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయని, ప్రతి ఇంటికీ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి పేర్కొన్నారు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేసి వివరించారు. గడపగడపకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుంటే విపక్షాలకు మాత్రం నచ్చడం లేదన్నారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, కాకర్ల మోహన్ నాయుడు, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ పద్మిని, ఎంపీటీసీ షాజహాన్, ననుద్దిగారి హుసేన్‌బాషా, అల్లా మహ్మద్, ఖలీల్, బోయిన వాసు, సుబ్బయ్య, కాకర్ల చిన్నన్న, కాకనూరు మనోహర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జాకీర్, శాంతయ్య, భూమా శ్రీనివాస రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బత్తుల కృష్ణయ్య యాదవ్, శివప్రసాద్, గోవిందపల్లె మహబూబ్‌బాషా, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, హౌసింగ్ ఏఈ జేమ్స్ ప్రసాద రావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(సిటీ): నంద్యాల నియోజకవర్గ పరిధిలోని గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయాన్ని సందర్శించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి సుమారుగా 4,601 గృహాలు మంజూరు కాగా 3,432 గృహాల నిర్మాణాలు పూర్తి స్థాయిలో ఉన్నాయని, మరో 1,109 గృహాలు వివిధ స్థాయిలో ఉన్నాయన్నారు. గృహ నిర్మాణ శాఖ పీడీ విజయభాస్కర్ నాయుడు, హౌసింగ్ అధికారులు ఉన్నారు.


నేడు జగనన్న సురక్ష

గోస్పాడు: మండల కేంద్రంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. ప్రజలకు వివిధ రకాల ధ్రువ పత్రాలు అందజేస్తామని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించండి

శిరివెళ్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించాలని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ తెలిపారు. శనివారం ఓటర్ల జాబితా పరిశీలనపై వీఆర్వోలు, బూతు లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి మరణించిన, డబల్ ఓటు, గ్రామాలు వదిలి వెళ్లిన వారిని గుర్తించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కోసం నమోదు చేయించాలని చెప్పారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


చీర,సారెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

చాగలమర్రి: స్థానిక గంగమ్మ వీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మతల్లికి వర్షాలు కురువాలని శుక్రవారం సాయంత్రం స్థానిక అమ్మవారిశాల నుంచి మేయిన్‌బజారు మీదుగా భక్తులు ఊరేగింపుగా చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగ అలంకరించి విశేష పూజలు చేపట్టారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ నాగరాజు, హిందూ సంఘం అధ్యక్షుడు రమేష్, మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, సహా కన్వీనర్‌లు హేమకరాయ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

శిరివెళ్ల: మండలంలోని బోయలకుంట్ల గ్రామానికి చెందిన పదో తరగతి చదివిన విద్యార్థి గిద్దలూరి వంశీ (17) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వంశీ గోస్పాడు మండలం దీబగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి చదివి ఈ ఏడాది మార్చిలో పరీక్షలు రాసి ఫెయిలయ్యాడు. మళ్లీ జూన్‌లో జరిగిన సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా ఫెయిలయ్యాడు. మనస్తాపంతో గత నెల 23న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు కోలుకోలేక మృతి చెందాడు. విద్యార్థి తండ్రి ప్రభుదాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

వేధింపుల కేసు నమోదు

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు భర్తపై వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. లక్ష్మీదేవిని వెలుగోడుకు చెందిన వేల్పనూరు రాజేంద్రప్రసాద్‌కు ఏడేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో కట్న కానుకల కింద ఆయనకు రూ.5లక్షలు అందజేశారు. అయితే ఐదేళ్ల నుంచి భర్తతో పాటు అత్త మరియమ్మ, ఆడపడుచు అనురాధ, ఆమె భర్త బలవర్ధన్ అదనపు కట్నం తేవాలని నిత్యం వేధించేవారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన అన్వర్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని జమ్మలమడుగు బైపాస్ రోడ్డు సమీపంలో కోట్ల అన్వర్ (43) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలలోని జగజ్జననీ నగర్‌కు చెందిన అన్వర్‌కు భార్య షబానా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అన్వర్ కొన్ని నెలల నుంచి స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఉన్న ఖాజా అనే వ్యక్తికి చెందిన ఇనుప గోలాల తయారీ కేంద్రంలో పని చేస్తున్నాడు. రాత్రి సమయంలో అక్కడే ఓ గదిలో నిద్రించేవాడు. గురువారం రాత్రి సమీపంలోని ఈద్గా మైదానంలో నిద్రించాడు. రాత్రి పొద్దుపోయాక యజమాని ఖాజా వచ్చి చూడగా అన్వర్ తలకు దెబ్బ తగిలి చనిపోయి ఉన్నాడు. వెంటనే విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపాడు. షబానా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే అందుతున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శివలింగమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకరవాడ గ్రామానికి 104 వాహనంలో వైద్య సిబ్బంది తరలి వెళ్లి 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెడికల్ సూపర్‌వైజర్ మునిస్వామి పాల్గొన్నారు.

యర్రగుంట్ల వాసికి డాక్టరేట్

శిరివెళ్ల: యర్రగుంట్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు కేల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. గత నెల 27న యూనివర్సిటీ రిజిస్ట్రార్ పీహెచ్‌డీ డాక్టరేట్ అవార్డు ప్రకటించింది. విజయవాడలోని కేల్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగంలో 5 సంవత్సరాలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ప్రొఫెసర్ ప్రవీణ్ పర్యవేక్షణలో అప్టీమైజ్డ్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి సోషల్ మీడియాలో స్పామ్ వర్గీకరణ, భావోద్వేగాల గుర్తింపు అనే అంశంపై పరిశోధన చేశారు.

కేసు నమోదు

దొర్నిపాడు: చాకరాజువేముల గ్రామానికి చెందిన బూసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి మద్యం సేవించి రోడ్ల వెంట అసభ్యంగా ప్రవర్తిస్తూ అల్లరి చేస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ శుక్రవారం తెలిపారు.

పదోన్నతులు కల్పించాలి

నంద్యాల(అర్బన్): వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించాలని నంద్యాల జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. ఆర్‌డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్ తదితర ఉద్యోగాల్లో సహాయకులకు పదోన్నతులు ఇవ్వాలంటూ డీఆర్‌ఓ పుల్లయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

పాఠ్యపుస్తకాలు మంజూరు

ఉయ్యాలవాడ: మండలానికి సంబంధించి సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1– 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తామని చెప్పారు.22వ తేదీన హెచ్‌ఎంలు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

దోమల కాటుతో విషజ్వరాలు

గోస్పాడు: దోమకాటుతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని నంద్యాల జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం గోస్పాడు, కానాల గ్రామాల్లో ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు డ్రైడేపై అవగాహన కల్పించాలని, ఫీవర్ సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

రుద్రవరం: ఆర్.నాగులవరం గ్రామ సచివాలయ పరిధిలోని టీ.లింగదిన్నెలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం తెలిపారు.

ఆర్థిక సాయం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీలో వాటర్ ఫిట్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తులసీరామ్ మధు అనే అవుట్ సోర్స్ ఉద్యోగి మే25న గుండె పోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుని కుటుంబాన్ని ఆదుకునేందుకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అసోసియేషన్ నుంచి సేకరించిన విరాళం మొత్తం రూ.50,500ను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి చేతుల మీదుగా మృతుడి భార్య చంద్రకళకు శుక్రవారం అందజేశారు. తులసీరామ్ మధు కుటుంబానికి అండగా ఉంటామని కమిషనర్ పేర్కొన్నారు.